సర్వే పకడ్బందీగా నిర్వహించాలి..

పర్సాపూర్‌లో సర్వే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

కొడంగల్, నవంబర్ 01: సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వే కార్యక్రమాన్ని నారాయణపేట్ కలెక్టర్ సిక్తా పట్నయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం మండలంలోని పర్సాపూర్, దుద్యాల మండలంలోని హస్నాబాద్ గ్రామాల్లో సిబ్బంది చేపడుతున్న సర్వేను పరిశీలించి అధికారులు సేకరిస్తున్న వివరాలను, ఇండ్ల గుర్తింపు వంటి అంశాలపై సిబ్బందికి పలు సూచనలు అందించారు. ఇంటింటి సర్వేలో అందించిన ఫామ్‌లో ఉన్న 56 అంశాలకు సంబంధించిన వివరాలను సేకరించి పూరించాలని తెలిపారు. ఎటువంటి తప్పులు లేకుండా సర్వే కొనసాగాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్, తసీల్దార్ విజయ్‌కుమార్‌తో పాటు సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన నూతన డీఎంహెచ్‌వో

డీఎంహెచ్‌వో రమణను సన్మానించిన వైద్యాధికారులు, సిబ్బంది

వికారాబాద్, నవంబర్ 1 : వికారాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా ఇటీవల బదిలీపై వచ్చిన డాక్టర్ వెంకటరమణ శుక్రవారం వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, ప్రోగ్రాం అధికారులు డీఎంహెచ్‌ఓను సన్మానించి.. స్వాగతం పలికారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ లింగ్యా నాయక్‌ను, అడిషనల్ కలెక్టర్ సుధీర్‌లను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. వారితో పాటు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జీవరాజ్, డాక్టర్ రవీంద్ర యాదవ్ , డిప్యూటీ డెమో శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

అరుణాచలానికి సూపర్ లగ్జరీ బస్సులు

షాద్‌నగర్‌టౌన్, నవంబర్ 1: షాద్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఆర్టీసీ డీఎం ఉష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తిక పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణ చేసే భక్తుల కోసం ఈ బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఈ నెల 15న పౌర్ణమిని పురస్కరించుకుని సూపర్ లగ్జరీ బస్సు ఈ నెల 13న రాత్రి 7గంటలకు షాద్‌నగర్ బస్‌స్టేషన్ నుంచి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం చేరుకుంటుందని వివరించారు. గిరి ప్రదక్షణ పూర్తయిన తరువాత సాయంత్రం 4గంటలకు అరుణాచలం నుంచి షాద్‌నగర్‌కు బస్సులు తిరిగి రావడం జరుగుతుందన్నారు. ఇందుకుగాను పెద్దలకు రూ.3600, పిల్లలకు రూ.2400 టికెట్ ఛార్జ్ చేస్తున్నామని తెలిపారు. www.tsrtconline.in ఆన్‌లైన్ ద్వారా, బస్సు రిజర్వేషన్ కేంద్రంలో రిజర్వేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9490021433, 9182645281, 9959226287 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విదేశీ పర్యటనకు వెళ్తున్న అసెంబ్లీ స్పీకర్‌గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, నవంబర్ 1 : ఆస్ట్రేలియా లోని సిడ్నీ లో జరిగే 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) కాన్ఫరెన్స్ లో పాల్గొనడానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వెళ్లనున్నారు. శనివారం అధికారిక విదేశీ పర్యటనకు వెళ్తున్న శాసనమండలి బృందంతో పాటు రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ , లేజిస్లేచర్ సెక్రటరీ వి. నరసింహా చార్యుల బృందం బయలు దేరనుంది. శనివారం రాత్రి (నవంబర్ 2) శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి సిడ్నీకి బయలుదేరుతారు. సీపీఏ కాన్ఫరెన్స్ అనంతరం స్టడీ టూర్ లో భాగంగా న్యూజిలాండ్, జపాన్, దక్షిణ కొరియా దేశాలలో పర్యటిస్తారు. అనంతరం నవంబర్ 16, 2024 న పర్యటన ముగించుకుని హైదరాబాద్ కు తిరిగి వస్తారు.

వద్దన్నవారికి ఇల్లు.. కావాలన్నోళ్లకు మొండిచెయ్యి.!

- మూసీ బాధితులతోనే డబుల్ ఇండ్ల భర్తీకి సర్కార్ యత్నం
- స్థానిక నిరుపేదల ఆగ్రహం
- తమకు ఇండ్లు ఇవ్వరా.. అంటూ ఫైర్
- ఇండ్ల దరఖాస్తులు అధిక సంఖ్యలో రావడంతో..
- కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్

సిటీబ్యూరో, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): డబుల్ బెడ్ రూం ఇండ్ల కేటాయింపు సర్కార్‌కు తలనొప్పిగా మారింది. ఇండ్లు కావాలంటూ గతంలో దరఖాస్తు పెట్టుకున్న వారిని కాదనీ.. ఇప్పుడు మూసీ బాధితులకు ఇండ్లు కేటాయించడంపై స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూసీ పునరుజ్జీవనం– సుందరీకరణ కత్తిమీద సాములా మారుతోంది. పేదోళ్ల నివాసాలను కూల్చి.. వారికి డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయిస్తున్నప్పటికీ వాళ్లంతా నిరుత్సాహంగానే ఉన్నారు. తమ ఇండ్లు కూల్చడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయిష్టంగానే డబుల్ ఇండ్లల్లో అడుగులు పెడుతున్నారు. సొంత ఇండ్లను లాక్కొని డబుల్ ఇల్లును కేటాయించడం.. ఉమ్మడి ఫ్యామిలీల నివాసాలకు ఉపయోగపడకపోవడంతో వాళ్లంతా సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ ఇండ్లల్లో తిష్టవేసిన సమస్యలను సైతం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని వాపోయారు. ఇలాంటి సందర్భంలో సొంత ఇండ్లు కోల్పోయిన వాళ్లు... డబుల్ ఇండ్లలోకి రావడానికి ఆసక్తి చూపడం లేదు. బలవంతంగా వారికి ఇల్లు కేటాయించి తరలిస్తున్నారు. మరోవైపు హైదరాబాద్‌లో తమకు ఇల్లు కావాలంటూ కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు అందిస్తున్నారు. దరఖాస్తులు అధిక సంఖ్యలో వస్తుండంటంతో కలెక్టరేట్‌లో గృహ నిర్మాణ శాఖలో ప్రత్యేక కౌంటర్ తెరిచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇది వరకు ఇచ్చిన దరఖాస్తులే లక్షల్లో ఉన్నాయి. ఇప్పటికీ దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. దీంతో అర్హులు చాలా మంది ఉన్నారని గుర్తించినప్పటికీ డబుల్ బెడ్ రూంలను స్థానికంగా ఉన్న అర్హులను కాదనీ.. మూసీ బాధితులకు కేటాయించడంపై స్థానిక ప్రజలు, రాజకీయ నాయకుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటువంటి గందరగోళ మూసీ పరిస్థితులు రేవంత్ సర్కార్‌కు ఊపిరి సలపనివ్వడం లేదు. ఎలాగైనా మూసీ నిర్మాణాలు కూల్చి ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డికి అటు మూసీ బాధితులు, ఇటు స్థానిక జనం నుంచి ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల మధ్య మూసీ నిర్మాణాల కూల్చివేతలు ఎలాంటి మలుపు తీసుకుంటాయోనని నిపుణులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

హైడ్రా వద్దకు అమీన్‌పూర్ బాధితులు

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేస్తున్న అమీన్‌పూర్ బాధితులు

సిటీబ్యూరో, నవంబర్ 1(నమస్తే తెలంగాణ): అమీన్‌పూర్ ఏరియాలో తమకు అన్యాయం జరిగిందంటూ శుక్రవారం హైడ్రా కార్యాలయంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు పలువురు స్థానికులు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 6 అనుమతులు చూపించి.. సర్వే నంబర్ 12కు చెందిన ప్రభుత్వ భూమిని మాధవరెడ్డి, కోటేశ్వర్‌రావు, చంద్రశేఖర్ అనే వ్యక్తులు ప్లాట్లుగా చూపించి తమను మోసం చేసి విక్రయించారంటూ కొందరు ఫిర్యాదు చేశారు. రద్దయిన అనుమతుల విషయాన్ని బయటకు చెప్పకుండా విక్రయించారని, తమను మోసం చేసి అమ్మిన వ్యక్తుల నుంచి నష్టపరిహారం ఇప్పించాలని హైడ్రా కమిషనర్‌ను కోరారు. అమీన్‌పూర్ మండలంలోని పెద్ద చెరువు అలుగులు మూసేసి, ఎగువవైపు తమ స్థలాల్లోకి నీరు వచ్చేలా చేశారని, పెద్ద చెరువు నీరు దానికింద ఉన్న బండికుంట చెరువుకు వెళ్లేలా కాకుండా.. అలుగులు మూసేయడంతో ఎగువవైపు నీరుపారి ఇండ్ల స్థలాలు కోల్పోయామంటూ కమిషనర్‌కు మరికొందరు ఫిర్యాదు చేశారు. సర్వేనంబర్ 153లో హుడా అనుమతి పొందిన లే అవుట్లలో ఉన్న పార్క్ స్థలం పక్కనే కొత్తగా వెంచర్ చేస్తున్న వారు కబ్జా చేశారంటూ వెంకటరమణకాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులన్నీ పరిశీలించిన కమిషనర్ రంగనాథ్.. వీటిపై విచారణ జరిపిస్తామని, సమగ్ర సర్వే జరిపి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు.

ఫోర్జరీ సంతకాలు.. నకిలీ పత్రాలతో బోగస్ లే అవుట్లు

- వట్టినాగులపల్లిలో ప్లాట్ల పేరుతో రూ.1.45 కోట్లు వసూలు
- సాయిసూర్య డెవలపర్స్ ప్రొప్రైటర్ అరెస్ట్

సిటీబ్యూరో, 1 నవంబర్ (నమస్తే తెలంగాణ): ఫోర్జరీ సంతకాలు, నకిలీ పత్రాలతో లేని లేఅవుట్‌ను సృష్టించి.. ప్లాట్ విక్రయం పేరుతో ఒక వ్యక్తి నుంచి రూ.1.45 కోట్లు వసూలు చేసి, రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసిన సాయిసూర్య డెవలపర్స్ ప్రొప్రైటర్‌ను సైబరాబాద్ ఆర్థిక నేర విభాగం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈఓడబ్ల్యూ డీసీపీ కె.ప్రసాద్ కథనం ప్రకారం.. నెల్లూరుకు చెందిన కంచర్ల సతీశ్ చంద్రగుప్తా ఉపాధి కోసం నగరానికి వలసొచ్చి గచ్చిబౌలి రాయదుర్గంలో నివాసం ఉంటున్నాడు. కాగా, సాయి సూర్య డెవలపర్స్‌కు ప్రొప్రైటర్‌గా వ్యవహరిస్తున్న సతీశ్ చంద్రగుప్తా.. భాగ్యనగర్ ప్రాపర్టీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నరేందర్ సురానాతో కలిసి వట్టినాగులపల్లిలో ఫోర్జరీ సంతకాలు, నకిలీ పత్రాలతో సాయి తులసి ఎన్‌క్లేవ్–4, శణ్ముక నివాస్ పేర్లతో లే అవుట్లను సృష్టించారు. ఈ లేఅవుట్‌లో ఒక ప్లాట్‌ను రూ.3.25 కోట్లకు విక్రయించేందుకు సతీశ్ చంద్రగుప్తా నాచారం ప్రాంతానికి చెందిన పోతుగంటి గోపాల్‌రెడ్డితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఒప్పందంలో భాగంగా గోపాల్‌రెడ్డి వద్ద నుంచి రూ.1.45 కోట్లు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. రోజులు గడుస్తున్నా ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయకుండా తప్పించుకు తిరుగుతున్న సతీశ్‌చంద్రపై బాధితుడు గోపాల్‌రెడ్డి సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఈఓడబ్ల్యూ ఇన్‌స్పెక్టర్ జె.వెంకటేశ్వర్లు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని శుక్రవారం అరెస్టు చేశారు.

అప్రమత్తంగా ఉండాలి: ఈఓడబ్ల్యూ డీసీపీ ప్రసాద్

నకిలీ పత్రాలు, కల్పిత లేఅవుట్లతో కొన్ని రియల్ ఎస్టేట్ సంస్థలు అమాయక ప్రజలను మోసగిస్తున్నాయని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈఓడబ్ల్యూ డీసీపీ ప్రసాద్ ప్రజలను హెచ్చరించారు. ప్లాట్లు, స్థలాలు కొనుగోలు చేసే ముందు వాటికి సంబంధించిన పత్రాలను సంబంధిత శాఖల నుంచి తెలుసుకోవాలన్నారు. ఆ తర్వాతే కొనుగోలుకు సంబంధించిన లావాదేవీలు జరపాలన్నారు.

జల్సాల కోసం గంజాయి బాట

పోలీసులకు చిక్కి కటకటపాలైన నిందితులు

జీడిమెట్ల, నవంబర్ 1: జల్సాల కోసం గంజాయి స్మగ్లింగ్ బాటను ఎంచుకొని పోలీసులకు చిక్కారు. శుక్రవారం బాలానగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ సురేశ్‌కుమార్ ఈ వివరాలను వెల్లడించారు. నల్గొండ జిల్లాకు చెందిన సభావత్ సుమన్, రమావత్ లాల(38), కేతావత్ విజయ్‌కుమార్(32) పాత నేరస్తులు. సుమన్ వైజాగ్ జైలులో ఉన్న సమయంలో ఒడిశాకు చెందిన కిరణ్‌తో పరిచయం ఏర్పడింది. గత నెల అక్టోబర్ 27న సుమన్, విజయ్, లాలు ముగ్గురు కలిసి పల్సర్ బైక్‌పై దేవరకొండ నుంచి ఏపీలోని అల్లూరి జిల్లా పాడేరుకు వెళ్లారు. అక్కడ వీరికి ఒడిశాకు చెందిన కిరణ్ 2.500 లీటర్ల హాష్ ఆయిల్‌ను అందజేశాడు. ఈ ముగ్గురు కలిసి నంబర్ ప్లేట్ లేని పల్సర్ వాహనంపై హాష్ ఆయిల్‌ను తీసుకొని 31న హైదరాబాద్‌కు చేరుకున్నారు. అదే రోజు బాలానగర్‌లోని విమల్ థియేటర్ వద్ద ఆయిల్‌ను విక్రయించేందుకు సిద్ధమయ్యారు. విశ్వసనీయ సమాచారం మేరకు బాలానగర్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్‌హెచ్‌ఓ నరసింహారాజు, సిబ్బంది చాకచక్యంగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 13 లక్షల 50 వేల విలువజేసే హాష్ ఆయిల్, పల్సర్ బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

న్యాక్‌లో ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సు అడ్మిషన్లు ప్రారంభం

మాదాపూర్, నవంబర్ 1: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ఆధ్వర్యంలో జనరల్ కేటగిరీలోని ఇంటర్‌మీడియట్, డిప్లామా, డిగ్రీ, బీటెక్ అర్హతతో 6 నెలల ప్లేస్‌మెంట్ లింక్డ్ పేమెంట్ ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సుకు సంబంధించి అడ్మిషన్స్‌ను న్యాక్ సంస్థ ప్రారంభించింది. శిక్షణలో చేరడానికి ఆసక్తి గల అభ్యర్థులు కోర్సు ఫీజు, ఇతర వివరాలకు 9063208703లో సంప్రదించాలని సూచించారు.

వర్ష సూచన

సిటీబ్యూరో, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తన ప్రభావంతో శుక్రవారం గ్రేటర్‌లోని పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రాత్రి 10 గంటల వరకు మాదాపూర్‌లో అత్యధికంగా 5.88 సెం.మీలు, గచ్చిబౌలిలో 5.70, చందానగర్‌లో 4.18, మియాపూర్‌లో 2.75 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల రెండ్రోజులు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది.

హోటల్ రేటింగ్ సర్వే టాస్క్‌లంటూ..దోపిడీ

సిటీబ్యూరో: దేశ వ్యాప్తంగా ఉన్న హోటల్స్ సర్వే చేసి వాటికి రేటింగ్ ఇస్తే రోజు భారీగా సంపాదించవచ్చని నమ్మించి ఓ వ్యాపారి నుంచి సైబర్‌నేరగాళ్లు రూ. 28 లక్షలు దోచుకున్నారు. సికింద్రాబాద్‌కు చెందిన బాధితుడికి వాట్సాప్‌లో సందేశం వచ్చింది. ఒక్కో సర్వే, రేటింగ్‌కు రూ. 100 ఇస్తారంటూ సందేశమున్నది. బాధితుడు 3 సర్వేలు చేయడంతో రూ. 300 అతడి బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. ఆ తరువాత 'మీరు రూ. 2 వేలు పెట్టుబడి పెట్టండం'టూ నమ్మించి వెంటనే రూ. 2800 ఇచ్చారు. చివరకు రూ. 1,28,000 పెట్టుబడి పెట్టడంతో మోసం చేయడం మొదలుపెట్టారు. 'మీరు పంపించిన డబ్బులో క్రిప్టోలో మార్చడంలో ఇబ్బంది అయ్యిందని, మరో టాస్క్ చేయాలంటూ సూచించారు. ఈ క్రమంలో 30 శాతం ఇన్‌కం ట్యాక్స్ చెల్లించాలంటూ నమ్మించి.. బాధితుడి వద్ద నుంచి దఫ దఫాలుగా రూ. 28.45 లక్షలు కాజేశారు.

పీస్ వెల్ఫేర్‌లో యువతకు ప్రాధాన్యమివ్వాలి

సిటీబ్యూరో: పీస్ వెల్ఫేర్ కమిటీల్లో యువతను ప్రోత్సహిస్తూ వారికి కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సూచించారు. శుక్రవారం కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో అన్ని జోన్లకు నుంచి వచ్చిన సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీల సభ్యులతో సమావేశమయ్యారు. శాంతి భద్రతలను పరిరక్షించేందుకు, స్థానిక పోలీసులకు సహకరించాలని సూచించారు. హైదరాబాద్ ఖ్యాతిని కాపాడేందుకు అవిశ్రాంత కృషిని కొనసాగించాలని కమిటీ సభ్యులను సీపీ కోరారు. సమావేశంలో నగర అదనపు సీపీలు విక్రమ్ సింగ్ మాన్, విశ్వప్రసాద్, డీసీపీ చైతన్యకుమార్, స్నేహమెహ్రా పాల్గొన్నారు.

సంబురంగా సదర్

నగరంలోని నార్సింగి, ఖైరతాబాద్‌లో శుక్రవారం సదర్ సంబురాలు అంబరాన్నంటాయి. దున్నపోతుల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

సర్కారు స్థలం..కబ్జాకు యత్నం

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి, గండిమైసమ్మ–దుండిగల్ మండల పరిధిలో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా.. రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. సర్కారు స్థలాలు కబ్జాకు గురవుతున్నా.. అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కనీసం ప్రజలు ఫిర్యాదు చేసినా.. చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా మండల పరిధిలోని ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు మాయమవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మండల రెవెన్యూ కార్యాలయానికి వెళ్లేదారిలోని వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిలో అక్రమార్కులు మట్టిని నింపి.. చదును చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గండిమైపమ్మ–దుండిగల్ మండలం, దొమ్మరపోచంపల్లి గ్రామం, సర్వే నంబర్ 120/24 ప్రభుత్వ భూమిలో కొన్ని రోజులుగా కొందరు వ్యక్తులు వందలాది టిప్పర్ల ద్వారా మట్టిని వేస్తూ.. జేసీబీతో చదును చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. సదరు స్థలం గండిమైసమ్మ చౌరస్తా నుంచి మేడ్చల్ వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకొని ఉండటంతో పాటు ఎదురుగా దుండిగల్ పోలీస్‌స్టేషన్, కూతవేటు దూరంలో తహసీల్దార్, మున్సిపాలిటీ కార్యాలయాలు ఉండటంతో ఇక్కడి భూమికి గజం లక్షల్లో ధర పలుకుతున్నది. దీంతో విలువైన ప్రభుత్వ భూమిని ఎలాగైనా..ఆక్రమించుకునేందుకు కొందరు రాత్రికి రాత్రి మట్టిని నింపి చదును చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విషయం అధికారులకు తెలిసినా.. ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదని, సదరు ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. కాగా, ఈ విషయమై మండల రెవెన్యూ అధాకారులను సంప్రదించగా, ఎవరూ స్పందించకపోడం గమనార్హం.

వేగంతో వచ్చి.. గోడను ఢీకొట్టి..

బంజారాహిల్స్, నవంబర్ 1: అదుపుతప్పిన వేగంతో వచ్చిన ఓ కారు బంజారాహిల్స్‌లో బీభత్సం సృష్టించింది. కేబీఆర్ పార్కు బయట ప్రహరీని, గ్రిల్స్‌ను ఢీకొట్టింది.బంజారాహిల్స్ రోడ్ నం. 6లో నివాసముంటున్న ఉత్సవ్ దీక్షిత్ (33) ప్లాస్టిక్ కంపెనీకి ఎండీగా ఉన్నాడు. శుక్రవారం ఉదయం 4 గంటల సమయంలో ఫిలింనగర్ వైపు నుంచి బంజారాహిల్స్ రోడ్ నం. 10 వైపునకు కారులో వేగంగా వస్తున్నాడు. కళింగ చౌరస్తా నుంచి క్యాన్సర్ అస్పత్రి వైపునకు వెళ్తున్న కారు యూటర్న్ సమీపంలో ప్రమాదరకమైన మలుపు వద్ద అదుపు తప్పింది. అతివేగంగా వస్తూ ఎడమవైపు ఉన్న ఫుట్‌పాత్ మీకు ఎక్కడంతో పాటు కేబీఆర్ పార్క్ బయట జీహెచ్‌ఎంసీ వాక్‌కే చెందిన ప్రహరీని, గ్రిల్స్‌ను ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా గాల్లోకి ఎగిరి భారీ వృక్షాన్ని ఢీకొట్టి అగిపోయింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. కాగా, బెలూన్లు తెరుచుకోవడంతో ఉత్సవ్ ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డాడు.

బెంగళూరుకు హైడ్రా బృందం

- చెరువుల పునరుజ్జీవంపై అధ్యయనానికి స్టడీ టూర్
- వచ్చిన వెంటనే నాలుగు చెరువుల సుందరీకరణ

సిటీబ్యూరో, నవంబర్ 1(నమస్తే తెలంగాణ): హైడ్రా కమిషనర్ రంగనాథ్ తన బృందంతో కలిసి మరో నాలుగు రోజుల్లో కర్ణాటక రాజధాని బెంగళూరు సిటీలో పర్యటించనున్నారు. చెరువుల పునరుజ్జీవంపై బెంగళూరులో క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించడానికి కమిషనర్ అక్కడికి వెళ్తున్నారు. ఇటీవల రంగనాథ్ లేక్‌మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్‌మల్లి గవాడ్‌తో హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆ సమయంలో బెంగళూరులో చెరువుల పునరుద్ధరణ జరిగిన తీరుపై చర్చించారు. మురుగుతో నిండి, నీళ్లు లేకుండా ఉన్న చెరువులకు ఎలా పునరుజ్జీవం కల్పించారో తెలుసుకున్నారు. ఈ క్రమంలో బెంగళూరు వెళ్లడానికి హైడ్రా టీమ్ సిద్ధమైంది. బెంగళూరులో చెరువుల పునరుద్ధరణ, మురుగునీరు స్వచ్ఛంగా మార్చిన విధానంపై హైడ్రా కమిషనర్ అక్కడి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారు. అక్కడ పునరుద్ధరణ జరిగిన చెరువులపై స్టడీ చేసి..ఆ విధానాలను హైదరాబాద్‌లో ఎలా వర్తింపచేయాలో ప్రభుత్వంతో చర్చించనున్నామని హైడ్రా అధికారులు చెబుతున్నారు. చెరువులు మాత్రమే కాకుండా కొద్దిరోజుల కిందట డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై బెంగళూరు మాజీ డైరెక్టర్‌తో సమావేశమై మేనేజ్‌మెంట్ విధి విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చూశారు. ఈ నేపథ్యంలో బెంగళూరులో చెరువుల పునరుజ్జీవనంపై క్షేత్రస్థాయిలో స్థితిగతులను అధ్యయనం చేయడం, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో అనుసరించిన విధానాలను పరిశీలించడం కోసం హైడ్రా టీమ్ బెంగళూరు వెళ్లనున్నది. అక్కడ చెరువుల అధ్యయనం తర్వాత బాచుపల్లిలోని ఎర్రగుంట చెరువు, మాదాపూర్‌లోని సున్నంచెరువు, కూకట్‌పల్లిలోని నల్లచెరువు, రాజేంద్రనగర్‌లోని అప్పచెరువులకు పునరుజ్జీవం కల్పించాలని నిర్ణయించారు.

ఒక వర్షం పడితే బెంగళూరులో రహదారులే కాదు.. అపార్ట్‌మెంట్లకు అపార్ట్‌మెంట్లే వరదనీటిలో మునిగిపోతున్నాయి. మెట్రో రైళ్లు ఉన్నా కూడా ట్రాఫిక్ సమస్యకు ఇప్పటికీ తెరపడలేదు. బెంగళూరు తరహాలోనే హైదరాబాద్‌లోనూ ట్రాఫిక్ సమస్య ఉంది. హైదరాబాద్‌ను కూడా వరదలు ముంచెత్తాయి. అయితే బెంగళూరు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిపుణులతో హైడ్రా అధికారులు సమావేశంపై అందరిలో చర్చ జరుగుతున్నది. అసలు బెంగళూరులో ఉన్న పరిస్థితులకు హైదరాబాద్ స్థితిగతులకు పొంతనే ఉండదని గ్రేటర్‌కు చెందిన పట్టణ విభాగ నిపుణుడు చెప్పారు. టెక్నాలజీ పరంగా అక్కడి సెన్సార్‌ల వ్యవస్థ బాగానే ఉన్నా.. డిజాస్టర్ పరంగా బెంగళూరు మేనేజ్‌మెంట్ సక్సెస్ కాలేదని, అసలు హైదరాబాద్‌లో బెంగళూరు సిస్టమే పనిచేయదన్నారు.

మరో వంద చెరువులపై దృష్టి..

హైదరాబాద్‌లో వంద చెరువులపై హైడ్రా దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన జాబితాను కూడా హైడ్రా కమిషనర్ రంగనాథ్ పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్‌కు అందించారు. ఇందుకు సంబంధించి కొన్ని చెరువులను సీఎస్ఆర్ కింద, మరికొన్ని చెరువులను హెచ్ఎండీఏ నిధులతో అభివృద్ధి చేయనున్నారు. బెంగళూరులో చెరువుల పునరుజ్జీవం ఎలా జరిగిందో అధ్యయనం చేసి ఆ తర్వాత హైదరాబాద్‌లో చర్యలు చేపడుతారని హైడ్రా బృందం చెబుతున్నది.